క్లుప్తంగా

వైభవంగా జగన్నాథ రథయాత్ర



టేకిలో జగన్నాథయాత్రలో పాల్గొన్న భక్తులు

కపిలేశ్వరపురం: టేకిలో సీతారామ దుర్గా రామలింగేశ్వర ఆలయ కమిటీ, రాజమహేంద్రవరంలోని ఇస్కాన్ ఆలయ నిర్వహణ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం జగన్నాథ రథయాత్రను నిర్వహించారు. గ్రామ వీధుల్లో సంకీర్తనలను ఆలపిస్తూ యాత్ర సాగింది. పూరీ జగన్నాథ రథయాత్రను పురస్కరించుకుని గ్రామంలో రథయాత్రను నిర్వహించినట్టు నిర్వాహకులు తెలిపారు. సనాతన ధర్మ ప్రచారంలో భాగంగా చేపట్టిన యాత్రకు గ్రామ భక్తులు నుంచి విశేష స్పందన లభించినట్టు నిర్వాహకులు మేడిశెట్టి గోవిందరాజు, ఎస్.శ్రీనివాసదాస్, ఆర్.శ్యామ్‌దాస్ తెలిపారు.

ఘనంగా ముత్యాలమ్మ తీర్థం



అన్నసమారాధనను ప్రారంభిస్తున్న మూర్తి

రామచంద్రపురం: పట్టణంలోని వైఎస్ఆర్ నగర్‌లో ఉన్న ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం అనంతరం ఆదివారం తీర్థం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు తొగరు మూర్తి కుటుంబ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థులతో పూజలు చేయించి పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదాన కార్యక్రమాన్ని తొగరు మూర్తి ప్రారంభించారు. పట్టణ పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దుర్గాప్రసాద్, వీరభద్రుడు, తొగరు సుబ్బారావు, తొగరు బ్రహ్మాజీ, కొట్టువాడ హరిబాబు, పసుపులేటి వీరబాబు, నమ్మి శ్రీనివాస్, యానాదుల సంఘం అధ్యక్షుడు మల్రి సుబ్బారావు, కార్యదర్శి ఇళ్ల స్వామి, రాజు గణపతి బలుసు నరసింహమూర్తి మోషే కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన తలుపులమ్మ లోవ



భక్తుల పూజలందుకుంటున్న తలుపులమ్మ అమ్మవారు

రాయవరం: మండలంలోని పసలపూడి-మాచవరం గ్రామాల మధ్య పంట పొలాల్లో ఉన్న చిన తలుపులమ్మ లోవ భక్తులతో కిటకిటలాడింది. ఆషాఢమాసం ఆదివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. సాధారణంగా ప్రతి మంగళ, ఆది, శుక్రవారాల్లో తలుపులమ్మ లోవకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటుంటారు. ప్రస్తుతం ఆషాఢమాసం కావడంతో భక్తుల సంఖ్య పెరుగుతోంది. రాయవరం, రామచంద్రపురం, మండపేట, బిక్కవోలు, అనపర్తి మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన భక్తులు ఇక్కడకు వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటున్నారు. మొక్కుల అనంతరం భక్తులు ఆలయ ప్రాంగణంలో కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి వంటకాలు చేసుకుని సామూహిక సహ పంక్తి భోజనాలు చేశారు.

సూర్యదేవునికి పంచామృతాభిషేకాలు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన సూర్యదేవునికి ఆదివారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వెంకటనరసింహాచార్యులు స్వామివారికి విశేష పూజలు చేసి, ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

నిత్యాన్నదానానికి రూ.50 వేల విరాళం

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్ పటాన్‌చెరుకు చెందిన రమణ టూర్స్, ట్రావెల్స్ యజమాని రాయుడు వీవీ రమణమూర్తి ఆదివారం రూ.50 వేలు విరాళంగా అందజేశారు. సొమ్మును చెక్ రూపంలో ఆలయ ప్రధానార్చకుడు సూర్యనారాయణమూర్తికి అందజేశారు. దాతను స్వామివారి శేషవస్త్రాలు సత్కరించి స్వామి చిత్రపటం అందజేశారు.

సెల్‌ఫోన్లు, బైక్ చోరీ

అంబాజీపేట: మండలంలో రెండు సెల్ ఫోన్ లు, బైక్ చోరీకి గురయ్యాయి. మాచవరం శివారు గణేష్ కాలనీలో వాసంశెట్టి మురళీకృష్ణ ఇంటిలో ఉన్న రెండు సెల్‌ఫోన్లు ఆదివారం తెల్లవారుజామున చోరీకి గురయ్యాయి. అంబాజీపేట స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎం ఎదురుగా తూరంగికి చెందిన గుర్రం అశోక్‌కు చెందిన గ్లామర్ బైక్ చోరీకి గురైంది. వీరు ఇరువురు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

వానా కాలం.. వ్యాధులకు నిలయం

- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు
- వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన
- గ్రామాల్లో ఫ్రైడే డ్రైడేతో ప్రత్యేక చర్యలు

కపిలేశ్వరపురం: వేసవి ఎండలకు అల్లాడిపోయిన జనం నాలుగు చినుకులు పడి వాతావరణం చల్లబడగానే ఆనందపడతారు. చల్లదనాన్ని ఆశ్వాదిస్తూ సేదతీరుతారు. కానీ ఆ హాయిని పూర్తిగా ఆశ్వాదించకుండానే వ్యాధుల ప్రభావానికి గురవుతుంటారు. తరచూ చినుకులు పడుతుండడం, పరిసరాలు చిత్తడిగా మారడంతో వ్యాధుల తీవ్రత పెరుగుతుంది. ఎక్కువ మంది ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడతుంటారు. దీనిపై అవగాహన పెంచుకొని పరిశుభ్రత పాటిస్తే కాస్త ఉపశమనం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని పరిరక్షించేందుకు తగిన జాగ్రత్తలు చేపట్టింది. ప్రత్యేకమైన యాప్ ద్వారా ప్రజల ఆరోగ్య వివరాలను సేకరిస్తోంది. ఫ్రైడే డ్రైడే పేరుతో ప్రతి శుక్రవారం పారిశుధ్యంపై ప్రత్యక్ష కార్యాచరణ రూపంలో ప్రత్యేక చర్యలను చేపట్టింది. వర్షాకాలంలో ప్రజారోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది సూచనలపై ఈ కథనం



పడమరఖండ్రికలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

రెండు నియోజకవర్గాల్లో ప్రభుత్వ వైద్య ఆరోగ్య సేవకులు

నియోజకవర్గం	పీహెచ్‌సీలు	వైద్యులు	స్టాఫ్ నర్సులు	ఫార్మాసిస్టు
మండపేట	07	15	15	05
రామచంద్రపురం	09	15	23	09
మొత్తం	16	30	38	14

ఆరోగ్యంపై అవగాహన అవసరం



అంగర పీహెచ్‌సీ పరిధిలోని కపిలేశ్వరపురం, తాతపూడి, పడమర ఖండ్రిక, అంగర గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన సమావేశాలను నిర్వహిస్తున్నాం. వర్షాకాలంలో దోమల ప్రత్యుత్పత్తి వేగం పుంజుకోవడం వల్ల మలేరియా, డెంగీ జ్వరాలు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. నీటిలో జరిగే రసాయనిక మార్పులు వల్ల బ్యాక్టీరియా ప్రభావంతో టైఫాయిడ్, హెపటైటిస్ వంటి వ్యాధులు ఆశిస్తాయి. కొత్త, పాత నీరు కలయికతో ఏర్పడిన ఫంగస్ కారణంగా చర్మ వ్యాధులొస్తాయి. వీటిని ప్రజలు పరిశుభ్రతతో దూరంగా ఉండాలి.

– పి.రత్నకుమారి, వైద్యాధికారి, అంగర పీహెచ్‌సీ

మాంసాహారం మానేయడం మేలు



వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అచ్యుతాపురం, వల్లూరు, నల్లూరు, వెదురుమూడి తదితర గ్రామాల్లో వైద్య ఆరోగ్య కార్యకర్తలు అవగాహన కల్పిస్తున్నారు. వర్షాకాలం వ్యాధులు సంక్రమించే కాలం. మానసికంగానూ, శారీరకంగానూ ఆరోగ్యంగా ఉండాలి. ఆహార నియమాలను తప్పనిసరిగా పాటించాలి. ఆహార పదార్థాలు తగిన స్థాయిలో ఉడికించి తినాలి. మాంసాహారాన్ని పూర్తిగా మానడం మేలు. తేలికగా అరుగుదలకు అవకాసం ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి. క్రిమి కీటకాలు చేరకుండా నివాస ప్రాంతాల్లో కుండీలు, టైర్లులాంటి నిరుపయోగమైన వస్తువులను తొలగించాలి.

– డాక్టర్ కరుణేంద్రకుమారి, వైద్యురాలు, అచ్యుతాపురం పీహెచ్‌సీ

వేడి ఆహార పదార్థాలే తినాలి



వర్షాకాలంలో సాధారణ జలుబుతో పాటు ఫ్లూ, నిమోనియా రావడానికి అవకాశం ఉంది. ఇలాంటి ఇబ్బందులు ఉన్నప్పుడు బాగా ఉడికించిన ఆహారాన్ని వేడిగా ఉన్నప్పుడే తినేందుకు ప్రాధాన్యతనివ్వాలి. ఫిల్టర్ చేసిన, లేదా కాచి చల్లార్చిన నీటిని తాగాలి. వానలో తడవకుండా జాగ్రత్తపడాలి. ఈగలు, దోమలు ముసిరి ఆహార పదార్థాలపై పడకుండా చూసుకోవాలి. నీటి కాలుష్యం కారణంగా విరేచనాలు, వాంతులు అవ్వడం, చిన్నారుల్లో చర్మాన్ని నొక్కితే సొట్టలు పడడం, కళ్ల కింద ముడతలు పడడాన్ని బట్టి డయారియా లక్షణాలుగా నిర్ధారించుకోవచ్చు. వ్యాధి సోకిన వారు ఘన పదార్థాలను తగ్గించి ఓఆర్ఎస్, తదితర ద్రావకాలు ఆహారంగా తీసుకోవాలి.

– డాక్టర్ జె.అనూజ ప్రియాంక, అంగర పీహెచ్‌సీ

వరదలతో సమస్యలు



కపిలేశ్వరపురం, తాతపూడి, కూళ్ళ, వాకతిప్ప, తదితర గ్రామాలు గోదావరి తీరాన ఉన్నాయి. జూలై నుంచి సెప్టెంబర్ వరకూ వరదల ప్రభావం ఉంటుంది. గోదావరి నుంచి కాలువలు ద్వారా క్షేత్ర స్థాయి వరకూ ఎర్ర నీరు ప్రవహిస్తుంది. దాని ప్రభావం వల్ల కళ్ల కలకలు వస్తాయి. కళ్లను రుద్దకుండా శుభ్రమైన నీటితో కడగాలి. సాధారణంగా కళ్ల కలకలు 3 నుంచి 5 రోజుల్లో సహజంగానే తగ్గిపోతాయి. నీరు కలుషితం కావడం వల్ల కామెర్లు, టైఫాయిడ్ సోకే అవకాశాలుంటాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

– బి.రామారావు, హెల్త్ ఎడ్యుకేటర్, కపిలేశ్వరపురం

పరిశుభ్రత ముఖ్యం



వర్షా కాలంలో నివాసిత ప్రాంతాలు చెమ్మగిల్లి ఉంటాయి. పాలనా పరంగా క్రమం తప్పకుండా పారిశుధ్య చర్యలను చేపట్టేందుకు ఆదేశాలిచ్చాం. ప్రజలు అవగాహనతో సహకరించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వరదల సమయంలో నివాసితులు సంచరించే పరిసరాల పరిమాణం తగ్గిపోయి ఆరోగ్య సమస్యలొస్తాయి. నీరు లాగగానే పారిశుధ్య చర్యలు చేపడతాం. నీటి గుంతలు వద్ద బ్లీచింగ్, దోమలు లేకుండా ఎబేట్ వంటి మందును స్ప్రే చేయిస్తున్నాం.

– ఎం.రామకృష్ణారెడ్డి, ఎంపీడీఓ, కపిలేశ్వరపురం

'జగనన్న సురక్ష'కు ఆరు బృందాలు

మండపేట: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందించాలన్న సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి మండలంలో ఆరు బృందాలు ఏర్పాటు చేసినట్టు ఎంపీడీఓ ఐ.రాజు తెలిపారు. జూలై ఒకటో తేదీ నుంచి నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ప్రతి సచివాలయం పరిధిలో అధికారులు ప్రత్యేక శిబిరాలు నిర్వహించి, అక్కడికక్కడే సమస్యలు పరిష్కరించడంతో పాటు సర్వీస్ చార్జీలు లేకుండానే అవసరమైన సర్టిఫికెట్లు జారీ చేస్తారన్నారు. తనతో పాటు తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కె.గౌరీ, మండల పరిపాలన అధికారి వీఎస్ ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ పద్మ, ఏపీఎం ఎం.రవి ఆయా టీంలకు నేతృత్వం వహిస్తారని తెలిపారు. జూలై ఒకటో తేదీన పాలతోడు, మారేడుబాక, 3న కేశవరం-1వ సచివాలయం పరిధిలోను, ఏడిద-1వ సచివాలయం పరిధిలో, 5న కేశవరం-2, ఏడిద-2, 7న కేశవరం-3, ఏడిద-3, 10న ద్వారపూడి-1, ఏడిద -4 శిబిరాలు నిర్వహిస్తారన్నారు. 11న ద్వారపూడి-2, తాపేశ్వరం -1, 13న ద్వారపూడి -3, తాపేశ్వరం-2, 15న ద్వారపూడి-4, ఇప్పనపాడు-1, 17న జెడ్ మేడపాడు, ఇప్పనపాడు-2, 18న వెలగతోడు-1, 19న అర్తమూరు-1, 20న వెలగతోడు-2, అర్తమూరు-2, 22న వై.సీతానగరం గ్రామాల పరిధిలో క్యాంపులు జరుగుతాయని ఎంపీడీఓ రాజు ఒక ప్రకటనలో తెలిపారు.

గురుపౌర్ణమికి అంకురార్పణ

పెదపూడి: జి.మామిడాడలోని బోడవారి వీధిలో ప్రసిద్ధి చెందిన కలియుగ దైవం షిరిడీ సాయిబాబా గురుపౌర్ణమి వేడుకలు వచ్చే నెల మూడో తేదీన జరగనున్నాయి. ఈ వేడుకలకు ఆదివారం అంకురార్పణ పూజలు చేశారు. ఈ పూజల్లో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు, లయన్స్ క్లబ్, ఫ్యామిలీ హెల్త్ క్లబ్, ద్వారంపూడి అమ్మిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ద్వారంపూడి వెంకటరెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ జూలై 3 తెల్లవారుజామున 4 గంటల నుంచి బాబా వారికి మేలుకొలువు పూజలు చేస్తారన్నారు. అనంతరం పంచామృత అభిషేకాలు, రథోత్సవం, అనంతరం భారీ అన్న సమారాధన చేస్తారన్నారు. సాయంత్రం హారతి, పవళింపు సేవతో గురు పౌర్ణమి వేడుకలు వైభవంగా ముగుస్తాయన్నారు.

జగన్ పాలనలోనే పల్లెల పురోగతి

కాజులూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పట్టణాలకు దీటుగా పల్లెలు పురోగతి చెందుతున్నాయని వైఎస్సార్ సీపీ మండల బీసీ సెల్ కన్వీనర్ గుబ్బల ఏసురాజు అన్నారు. గొల్లపాలెం శివారు చీకట్లవారిపేటలో రూ.10 లక్షలతో నిర్మిస్తున్న సీసీ డ్రైన్ నిర్మాణానికి ఆదివారం ఏసురాజు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు బాబూరావు తదితరులు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. వారు మాట్లడుతూ రాష్ట్ర విభజన, గత పాలకుల నిర్లక్ష్య వైకరితో రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నప్పటికీ సీఎం జగన్ పేదల పురోగతికి సంక్షేమ పథకాలు అములు చేస్తున్నారన్నారు. గడప, గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు మంత్రి వేణుగోపాలకృష్ణకు చేసుకున్న వినపాలు మేరకూ సీసీ డ్రెయిన్ నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేశారని, పనులు పూర్తయితే గ్రామంలో పారిశుధ్యం సమస్యకు శాస్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరీదేవి, పార్టీ మండల సేవాదళ్ కన్వీనర్ టేకుమూడి దుర్గారావు, రామచంద్రపురం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ కాకతీయ రాజు, డైరెక్టర్ నల్లమిల్లి ఈశ్వరరెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



చీకట్లవారిపేటలో డ్రైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు

ప్రతి గడపకూ ప్రభుత్వ పథకం

- మంత్రి చెల్లుబోయిన వేణు
- పేకేరులో గడపగడపకూ మన ప్రభుత్వం

కె.గంగవరం: ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందేలా చూడలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. పేకేరు గ్రామంలో బుధవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి చెల్లుబోయిన వేణు పాల్గొని ప్రతి ఇంటికీ వెళ్లి ఆ కుటుంబానికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను వివరించి, వారు పొందిన లబ్ధిని తెలయజేశారు. తొలుత వాలంటీర్లు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ప్రతి గడపకూ వెళ్లి సమస్యలు తెలుసుకుని నమోదు చేసుకోవాలన్నారు. నమోదు చేసుకున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి అందరూ భాగస్వాములై పరిష్కరించాలన్నారు.

మేలు చేశాం.. మళ్లీ గెలిపించండి

ఆర్థిక, కుల, జనన, వివాహ తదితర 11 రకాల ధ్రువీకరణ పత్రాలను త్వరితగతిన అందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమం నెల రోజుల పాటు నిర్వహిస్తామరని పత్రాలు అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి ఒక్కరికి అండగా నిలవాలనే ఉద్దేశంతో పలు రకాల ప్రజా ప్రయోజన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తోందన్నారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మళ్లీ ఆశీర్వదించి సంక్షేమ పాలనను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంపన నాగమణి, జిల్లా వ్యవసాయ సలహా కమిటి డైరెక్టర్ బత్తుల అప్పారావు, మండల కోఆప్షన్ సభ్యులు కడలి విజయదుర్గా, మాజీ సర్పంచ్ నామాల గోపికృష్ణ, ఎంపీటీసీ కోట రామకృష్ణ, సచివాలయాల మండల కన్వీనర్ తోకల శ్రీను, మండల పరిషత్ విప్ కొప్పిశెట్టి లక్ష్మణ్, కన్వీనర కడలి ఉమా మహేశ్వరరావు, రాయుడు జగన్ తదితరులు పాల్గొన్నారు.



పేకేరులో వృద్ధుడికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణు

వరి సాగులో నారుమడి కీలకం



కాజులూరులో 80 శాతం పైబడి మొలకెత్తిన వరి విత్తనాలు

విత్తన ఎంపికపై దృష్టి పెట్టాలని అధికారుల సూచన

కాజులూరు: పంట ఏదైనా విత్తనం బాగుంటేనే దిగుబడి బాగుంటుంది. విత్తనం బలంగా ఉంటే పైరు ఆరోగ్యం పెరుగుతుంది. రైతులు విత్తనాల ఎంపికపై దృష్టి పెట్టాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం తూర్పు డెల్టాలోని వరి సాగు భూముల్లో నారుమడుల దశ కొనసాగుతోంది. డివిజన్‌లో కొందరు రైతులు నారుపోసి నాట్లు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. మరి కొందరు రైతులు వెదజల్లు (నేరుగా వరి విత్తనాలను చదును చేసిన పొలంలో చల్లడం)పద్ధతిని అనుసరిస్తున్నారు. వెదజల్లు విధానంలో మొలక శాతం తక్కువగా ఉన్నట్టయితే వరి మొక్కల మధ్య దూరం పెరుగుతుంది. అలాగే నారుమడుల విధానంలోనూ మొలక శాతం తక్కువగా ఉంటే నారు కొరత ఏర్పడుతుంది. ఈ సమస్యలను అధిగమించేందుకు రైతులు ముందుగానే వరి విత్తనాల్లో మొలక శాతాన్ని పరిశీలించి విత్తనాలు చల్లుకోవాలని కాజులూరు మండల వ్యవసాయాధికారి వి.అశోక్ చెబుతున్నారు.

మొలక శాతం పరిశీలించే విధానం

విత్తనాల మొలక శాతాన్ని పరిశీలించేందుకు ముందుగా పలుచని గుడ్డ, లేదా సరైన కాగితాన్ని తీసుకుని మడతలు, మడతలుగా చేయాలి. 100 వరి విత్తన గింజలను తీసుకొని మడతల మధ్య ఉంచి దానిని 24 గంటలు పూర్తిగా నీటిలో నానబెట్టాలి. తర్వాత పైకితీసి 24 గంటలు పొడిగుడ్డ లేదా గడ్డితో కప్పి మండీ కట్టాలి. ఐదు రోజుల తర్వత మొలక శాతాన్ని లెక్క కట్టాలి. 80 గింజలు తక్కువ కాకుండా మొలకెత్తినట్లయితే అవి నాణ్యమైనట్టుగా గుర్తించి మొత్తం విత్తనాలను నానబెట్టుకొవచ్చునని మండల వ్యవసాయాధికారి అశోక్ తెలిపారు. వ్యవసాయ సేద్యంలో విత్తన దశ కిలకమైందని రైతులు మేలైన విత్తనాలను ఎంపిక చేసుకోవడం ద్వారానే పైరు ఆరోగ్యంగా పెరిగి ఆశించిన దిగుబడు సాధించవచ్చునన్నారు.

'హిందీ మహాలక్ష్మి' సేవలు కొనసాగిస్తాం



హిందీ మహాలక్ష్మి చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న ట్రస్ట్ సభ్యులు, అభిమానులు

రామచంద్రపురం రూరల్: 'హిందీ మహాలక్ష్మి' సేవలను కొనసాగిస్తామని ఆకెళ్ల మహాలక్ష్మి మెమోరియల్ ట్రస్ట్ సభ్యులు పేర్కొన్నారు. వెలంపాలెం ఎస్‌బీఎంవీ ఫంక్షన్ హాలులో ఆదివారం ఆమె సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వైస్ ప్రెసిడెంట్ దేవరకొండ వెంకటలక్ష్మి మాట్లాడుతూ 40 ఏళ్ల పాటు వేలాది మంది విద్యార్థులతో హిందీ పరీక్షలు రాయించడమే కాకుండా ఆమె ప్రోత్సాహంతో పదుల సంఖ్యలో ప్రభుత్వ హిందీ ఉపాధ్యాయులుగా నియామకం పొందారన్నారు. మధ్యలో చదువులు మానేయలనుకునే అనేక మంది విద్యార్థులను ఆమె ప్రోత్సహించి చదివించేవారన్నారు. చివరి ఏడేళ్ల పాటు ఆమె కీళ్ల వాతానికి గురై మంచం దిగలేని పరిస్థితిలో కూడా విద్యా బోధన చివరి శ్వాస వరకూ కొనసాగించారన్నారు. ఆమె స్ఫూర్తితో పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు అందించడం, నిరక్షరాస్యత నిర్మూలనకు ట్రస్ట్ తరఫున సేవలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, ట్రస్ట్ సభ్యులు సీహెచ్ శ్రీలక్ష్మీ జ్ఞాన ప్రసూనాంబ, ఎస్.రాధాకృష్ణ, అంగర లక్ష్మీనారాయణ, దేవరకొండ కనకలత, చింతా సత్యనారాయణ మూర్తి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కుప్పకూలిన వంతెనను నిర్మించాలి

అంబాజీపేట: పుల్లేటికుర్రు శివారు వ్యాఘ్రేశ్వరం మీదుగా మోడేకుర్రు వెళ్లేందుకు అప్పర కౌశిక డ్రైన్‌పై ఉన్న వంతెన ఏడేళ్ల క్రితం కురిసిన భారీ వర్షానికి కుప్పకూలింది. ఈ వంతెనను 1979లో డ్రైయినేజీ శాఖ ఆధ్వర్యంలో నిర్మించారని స్థానికులు తెలిపారు. సుమారు నాలుగు దశబ్దాల పాటు ఈ రెండు గ్రామాలకే కాకుండా ఎంతో మందికి బాటసారులకు, రైతులకు ఉపయోగపడింది. ఈ వంతెన కుప్పకూలడంతో రాకపోకలు స్తంభించాయి. ఈ వంతెన కుప్పకూలిపోయిందన్న విషయం టీడీపీ నాయకులకు, అప్పటి ప్రజాప్రతినిధులకు తెలిసినప్పటికీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించి పట్టించుకోలేదు. స్థానికులు అప్పటి ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళితే త్వరలో నిర్మిస్తాం. ప్రతిపాదనలు వెళ్లాయని మాయమాటలు చెప్పారే తప్ప ఆచరణలో కనికరించలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతు ఉత్పత్తులు తరలించేందుకు, స్థానికులకు ఎంతో అవసరమయ్యే ఈ వంతెన నిర్మాణాన్ని చేపట్టాలని స్థానికులు, రైతులు కోరుతున్నారు.

శ్రీమోక్ష సంస్థ సేవలు అభినందనీయం



పేదలకు ఆహార ప్యాకెట్లు అందజేస్తున్న శ్రీనివాస్, వెంకటేశ్వరరావు

మండపేట: నిరుపేదలకు చేతనైనంతలో అండగా నిలవాలన్న ఆశయంతో కూలి పనులు చేసుకుని పేద యువకులు శ్రీమోక్ష స్వచ్ఛంద సేవా సంస్థను నెలకొల్పి సేవా కార్యక్రమాలు చేస్తుండడం అభినందనీయమని మండపేట శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు పంపన శ్రీనివాస్, శ్రీఎల్లారమ్మ కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్మన్ లేగా వెంకటేశ్వరరావు(వెంకన్న) పేర్కొన్నారు. పట్టణంలోని 20వ వార్డు గొల్లపుంత కాలనీలో ఆదివారం ఆ సంస్థ ఆధ్వర్యంలో పేదలకు ఆహార ప్యాకెట్లు పంపిణీని శ్రీనివాస్, వెంకన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా యువకులు చేసే సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. సంస్థ వ్యవస్థాప అధ్యక్షుడు ఎగ్గాడి లోవరాజు మాట్లాడుతూ ప్రస్తుతం ఆదివారం అన్నదానం నిర్వహిస్తున్నామని రాను రాను తమ సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామన్నారు. కాలనీలోని వంద మందికి పైగా పేదలకు ఆహార ప్యాకెట్లు అందజేశారు. సంస్థ సభ్యులు లోవరాజు, కర్రి వెంకటరమణ, సచివాడ దుర్గారావు, తాతపూడి సందీప్, సతీష్, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

దివాన్‌చెరువులో వైద్య శిబిరం

రాజానగరం: వెన్నెముక శస్త్ర చికిత్స చేయించుకుంటే మంచాన పడతారని, పక్షవాతం వస్తుందనేది కేవలం అపోహ మాత్రమేనని, అందులో నిజం లేదని రాజమహేంద్రవరానికి చెందిన వేద స్పైన్ సెంటర్ వైద్యులు డాక్టర్ తేజో ఫణీంద్ర అన్నారు. మండలంలోని దివాన్‌చెరువులో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో వెన్నెముక శస్త్ర చికిత్స గురించి జనంలో ఉన్న అపోహలను నివారించే ప్రయత్నం చేశారు. ఈ శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారిలో 98 శాతం మంది చికిత్స జరిగిన వారం రోజుల నుంచే ఎటువంటి ఇబ్బందీ లేకుండా వారి పనులు చేసుకోగలుగుతున్నారన్నారు. శిబిరంలో 120 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అవసరమైన వైద్య పరీక్షను కూడా ఉచితంగా నిర్వహించారు.

తొలగించకుంటే.. ప్రమాదం



దంగేరు-పేకేరు రహదారిలో ఎండిపోయిన చెట్లు

- రోడ్లకిరువైపులా ఎండిపోయిన చెట్లు
- పట్టించుకోని అధికారులు



కుడుపూరులో రోడ్డు పక్కన ఎండిన భారీ వృక్షం

కె.గంగవరం: గ్రామీణ ప్రాంతాల్లోని రహదారికి ఇరువైపులా ఎండిపోయిన చెట్లు ప్రమాదభరితంగా ఉన్నాయి. ఎప్పుడు కూలిపోతాయోనని ప్రజలు భయపడుతున్నారు. గత రెండు నెలలుగా ఎండ తీవ్రతకు రోడ్ల పక్కన చెట్లు ఎండిపోయాయి. ప్రస్తుతం రుతుపవనాల రాక కారణంగా ఎప్పుడు ఈదురుగాలులు, వర్షం పడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అటువంటి సమయంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఎండిన చెట్లు పడిపోయే ప్రమాదం ఉంది. ఆ సమయంలో ఎటువంటి ప్రమాదాలు జరుగుతాయోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

ఎప్పుడు ఏ ప్రమాదం జరుగునో..

రామచంద్రపురం నియోజకవర్గంలోని కె.గంగవరం మండలంలో పామర్రు-కె.గంగవరం, కుడుపూరు-పేకేరు, శివల-యర్రపోతవరం, దంగేరు-కుడుపూరు, కాజులూరు మండలంలోని కుయ్యేరు-కాజులూరు, గొల్లపాలెం-ద్రాక్షారామ, పలు గ్రామాలకు వేళ్లే రహదారులు, రామచంద్రపురం మండలంలో పామర్రు-రామచంద్రపురం, తాడిగొయ్య- వెంకటయ్యపాలెం, హసన్‌బాద-వక్రపూడి వంటి గ్రామాలకు వేళ్ల రహదార్లులో ఎండిపోయిన చేట్లు, తాటి, కొబ్బరి చెట్లు కోకొల్లలుగా ఉన్నాయి. రైతులు, వ్యాపారులు, విద్యార్థులతో ఈ రహదారులు ఎప్పుడు రద్దీగా ఉంటాయి. ద్విచక్రవాహనదారులు, కారులు, కాలినడకన ఎక్కువ వెళ్లేవారుంటారు.

ఎవరూ లేకపోవడంతో..

ఇటీవల నియోజకవర్గం వ్యాప్తంగా వీచిన భారీ ఈదురు గాలులకు ఎండిన చెట్లు నేలకొరిగాయి. ఆ సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో ఏ ప్రమాదం సంభవించలేదు. ప్రస్తుతం భారీ వర్షాలు, పిడుగులు పడతాయని వాతావరణ శాఖ ప్రజలను హెచ్చరిస్తుంది. ఈ తరుణంలో ఈ ఎండిన చెట్లను తొలగించకపోతే అధికారులు భారీ మూల్యం చెల్లింక తప్పదు. ఇప్పటికైనా ఆయా గ్రామాల పంచాయతీ అధికారులు, ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి ఎండిన చెట్లను తొలగించాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

వెంటనే తొలగించాలి

కుడుపూరు-దంగేరు రహదారిలో ఎండిన చెట్లు ఎక్కువగా ఉన్నాయి. ప్రతి రోజు ఈ రహదారి మోటారుసైకిళ్లు, కార్లు, సైకిల్‌తో రద్దీగా ఉంటుంది. ఎప్పుడు ఏ చెట్టు విరిగిపడుతుందో తెలియని పరిస్థితి.

– కడలి ఉమామహేశ్వరరావు, పేకేరు

ముందే మేల్కోవాలి

ప్రమాదం జరిగిన తరువాత బాధపడడం కంటే ముందే మేల్కొంటే మంచిది. గతంలో రోడ్డుపై ప్రమాణిస్తున్న ప్రయాణికుల మీద కొబ్బరి ఆకులు, ఎండిపోయిన చెట్టు కొమ్మలు పడి గాయపడిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి.

– యం.రాంబాబు యర్రపోతవరం